మొదటి పేజి తరువాయి

## అర్హులందరికీ రేషన్ కార్డులు.. నిరంతర ప్రక్రియ

అని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసిందని, ఇది ఒక చారిత్రక ఘట్టమని అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. గతంలో ప్రజలకు నాణ్యత లేని దొడ్డు బియ్యాన్ని సరఫరా చేసేవారని, అయితే తమ ప్రభుత్వం రైతులకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించి సన్న బియ్యాన్ని సేకరిస్తోందని తెలిపారు. దేశంలో మరే ఇతర రాష్ట్రంలో లేని విధంగా ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఆహార భద్రతకే కాకుండా, అది ఒక కుటుంబానికి ప్రభుత్వం కల్పించే గౌరవం, గుర్తింపు అని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో లేని ఎన్నో సంక్షేమ పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని, అందులో భాగంగానే ప్రతి నియోజకవర్గానికి 3,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను పరిశీలించి, త్వరలోనే వారికి కూడా కార్డులు జారీ చేస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## బ్రిటీష్ కాలం నాటి కుట్రలు నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది: కవిత

కవిత పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రెండు ప్రపంచ యుద్ధాల్లో భారతీయ సైనికులను బలవంతంగా వాడుకుని వేలాదిమంది ప్రాణాలను బ్రిటీషర్లు బలితీసుకున్నారని మండిపడ్డారు. వారు తెచ్చిన విధానాల వల్లే దేశంలో కుల వ్యవస్థ మరింత తీవ్రతరమైందని, అడవుల్లో ప్రశాంతంగా జీవించే ఆదివాసీలను రాజ్యం పరిధిలోకి తెచ్చి తీరని అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. బ్రిటీష్ పాలకులు దేశం విడిచి వెళ్లినా, వారి ఆలోచనా వైఖరి మాత్రం ఇంకా ఇక్కడే ఉండిపోవడం విచారకరమని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లీష్ మాట్లాడేవారే గొప్ప అన్నట్లుగా చూస్తూ, మాతృభాష అయిన తెలుగు మాట్లాడేవారిని తక్కువ చేసి చూడడం ఆనాటి గులాంగిరీకి నిదర్శనమన్నారు. చర్మం రంగును బట్టి మన మధ్య వైషమ్యాలు సృష్టించిన ఆనాటి మైండ్‌సెట్‌ను వీడి, స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు.

## భారత్ 'అద్భుతమైన పురోగతిని' సాధిస్తోంది

సాంకేతిక రంగాలలో అద్భుతమైన పురోగతిని సాధిస్తోంది. అంతేకాదు, అంతర్జాతీయ వేదికపై సముచితమైన, గణనీయమైన ప్రాబల్యాన్ని కలిగి ఉంది.' అని పుతిన్ భారత రాష్ట్రపతి, ప్రధానులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'రష్యా-భారత సంబంధాలు ఒక ప్రత్యేకమైన వ్యూహాత్మక భాగస్వామ్య స్ఫూర్తితో విజయవంతంగా అభివృద్ధి చెందుతున్నాయి. మాస్కో, న్యూఢిల్లీ విస్తృత శ్రేణి రంగాలలో ఫలవంతమైన సహకారంలో నిమగ్నమై ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి, షాంఘై సహకార సంస్థ, బ్రిక్స్, ఇతర బహుపాక్షిక సంస్థల విషయంలో సన్నిహితంగా సమన్వయం చేసుకుంటున్నాయి' అని పుతిన్ అన్నారు. ఇరు దేశాలు తమ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటాయని పుతిన్ విశ్వాసం వ్యక్తం చేశారు. 'మన మిత్ర దేశాల ప్రజల ప్రయోజనం కోసం, అంతర్జాతీయ భద్రత, స్థిరత్వాన్ని పెంపొందించే ఆసక్తితో, మన ఉమ్మడి ప్రయత్నాల ద్వారా నిర్మాణాత్మక రష్యా-భారత్ భాగస్వామ్యాన్ని సమగ్రంగా బలోపేతం చేస్తామని నేను విశ్వసిస్తున్నాను' అని పుతిన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## ఒక్క ట్వీట్‌తో హోర్ముజ్‌ను స్వాధీనం చేసుకోలేరు'..

హోర్ముజ్ జలసంధి ని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ట్వీట్లు లేదా సైనిక శక్తి ద్వారా హోర్ముజ్ జలసంధిని సొంతం చేసుకోవడం సాధ్యం కాదని, ఆ జలసంధి ఎప్పటికీ ఇరాన్ పరిధిలోనే ఉంటుందని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కాజెమ్ ఘరీబాబాది స్పష్టం చేశారు.

### ట్రంప్ వ్యాఖ్యలు.. ఇరాన్ ఘాటు కౌంటర్!

డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు: న్యూయార్క్‌లోని ఓ కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, 'ఇరాన్‌ను ఓడించిన వెంటనే హోర్ముజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తాను' అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, ఈ జలసంధిపై అమెరికాకు సంపూర్ణ నియంత్రణ ఉందని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఇరాన్ కౌంటర్: 'హోర్ముజ్ జలసంధి గతంలోనూ, ఇప్పుడు, ఎప్పటికీ ఇరాన్ సొంతమే' అని ఘరీబాబాది తేల్చి చెప్పారు. ట్వీట్ల ద్వారా లేదా నౌకాదళ నౌకల బెదిరింపులతో దీనిని ఆక్రమించడం కుదరదని, తమ అనుమతి లేకుండా ఏ వాణిజ్య నౌక కూడా ఈ జలసంధి ద్వారా ప్రయాణించలేదని ఇరాన్ మిలిటరీ స్పష్టం చేసింది. వైట్ హౌస్ వివరణ: ట్రంప్ వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపడంతో, ఆయన ఆ వ్యాఖ్యలను సరదాగా (జోక్‌గా) అన్నారని ఒక ఉన్నతాధికారి వెల్లడించినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది.

## తిరుమలలో రద్దీ ఎక్కువగా ఉంది.. భక్తులు పరిస్థితిని గమనించి రావాలి

వారాంతపు సెలవులు కావడంతో తిరుమలకు భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు వెలుపల శిలాతోరణం వరకు బారులు తీరాయి. ప్రస్తుతం దర్శన టికెట్లు, టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. ఆగస్టు 14వ తేదీన మొత్తం 73,699 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 39,884 మంది తలనీలాలు సమర్పించగా, హుండీ ద్వారా రూ. 4.03 కోట్ల ఆదాయం లభించింది. అదేవిధంగా, టీటీడీ మొత్తం 4.31 లక్షల లడ్డూలను విక్రయించగా, 2.41 లక్షల మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం అందించింది. భారీ రద్దీ ఉన్నప్పటికీ, భక్తులకు అవసరమైన అన్నప్రసాదం, తాగునీరు, వైద్య సేవలు వంటి సౌకర్యాలను టీటీడీ నిరంతరాయంగా అందిస్తోంది. శుక్రవారం ఒక్కరోజే అశ్విని ఆసుపత్రిలో 3,559 మందికి వైద్య సేవలు అందించినట్లు అధికారులు తెలిపారు. రద్దీని క్రమబద్ధీకరించేందుకు, భక్తుల నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు టీటీడీ అధికారులు, సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారు.

## వెయ్యి కోట్లు ఇచ్చినా జగ్గారెడ్డి వంటి వారు దొరకరు

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంస

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని శ్రీరాముడు అనుకుంటే, జగ్గారెడ్డి ఆయనకు హనుమంతుడి వంటి వారని అభివర్ణించారు. "నాయకులకు మార్కులు వేస్తే నాకంటే జగ్గారెడ్డికే ఎక్కువ వస్తాయి. అలాంటి నాయకుడిని ఓడించడం ఈ ప్రాంత ప్రజల దురదృష్టం" అని సంగారెడ్డి ప్రజలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ జగ్గారెడ్డి నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ పనిచేస్తున్నారని రేవంత్ రెడ్డి కొనియాడారు. "కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు ఆయన. ఇక్కడ పరిస్థితులు ఎలా ఉన్న, జగ్గారెడ్డి కచ్చితంగా ప్రజా జీవితంలోనే ఉండాలి" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## వందేమాతరం ఆలపించని కేరళ

## కేంద్రం ప్రోటోకాల్‌కు భిన్నంగా స్వాతంత్ర్య వేడుకలు

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ కేరళలో రాజకీయ వివాదం

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం కేవలం జన గణ మన గీతాన్ని ఆలపించిన ప్రభుత్వం

ఢిల్లీ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కేరళలో రాజకీయ వివాదానికి దారి తీశాయి. జాతీయ గేయం 'వందేమాతరం' ఆలాపనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన కొత్త ప్రోటోకాల్‌కు భిన్నంగా కేరళ ప్రభుత్వం అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించింది. శనివారం తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వీడీ సతీశన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమం అనంతరం జన గణ మన గీతాన్ని ఆలపించారు. అయితే, ఈ అధికారిక రాష్ట్ర వేడుకలో వందేమాతరం గేయాన్ని మాత్రం ఆలపించలేదు. దీంతో ఈ విషయం రాజకీయంగా చర్చనీయాంశమైంది. అయితే, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందే కేరళ ప్రభుత్వ వైఖరిపై ఆసక్తకర పరిణామాలు నెలకొన్నాయి. కొద్ది రోజుల క్రితం, వందేమాతర గేయాన్ని పూర్తి స్థాయిలో ఆలపిస్తారా? అని ప్రశ్నించగా, అందుకు సూటిగా సమాధానం ఇవ్వడానికి సతీశన్ నిరాకరించారు. 'వేచి చూడండి' అని సమాధానం ఇచ్చారు. అంతేకాదు, ఈ విషయంపై కాంగ్రెస్, యూడీఎఫ్‌కు స్పష్టమైన వైఖరి ఉందని కూడా తెలిపారు. తీరా స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరాన్ని పక్కనబెట్టడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. మరోవైపు, కేరళ విద్యాశాఖ కూడా రాష్ట్రంలోని పాఠశాలల్లో జెండా ఎగురవేసి కేవలం 'జనగణమన' పాడాలని ఆదేశించింది తప్ప, వందేమాతరం పాడాలని ఎలాంటి సూచనలు చేయలేదు. ఈ విస్మరణ రాష్ట్రంలో ఇప్పటికే రాజకీయ వివాదాన్ని రేకెత్తించింది. కాగా, వందేమాతరం గేయం ఆలాపనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇటీవల వివరణాత్మక మార్గదర్శకాలను జారీ చేసింది. పార్లమెంట్ కూడా జాతీయ గౌరవానికి అవమానం నిరోధక చట్టంలో మార్పులు చేసి జాతీయ గేయానికి చట్టపరమైన రక్షణ కల్పించింది. నిర్దేశిత అధికారిక, ఆచార కార్యక్రమాల్లో జాతీయ గేయాన్ని ఆలపించాల్సి ఉంటుంది. ఒకే కార్యక్రమంలో జాతీయ గేయం, జాతీయ గీతం రెండింటినీ ఆలపించే సందర్భంలో ముందుగా 'వందేమాతరం', ఆ తర్వాత 'జనగణమన' పాడాలని జులై 9న కేంద్రం ఉత్తర్వుల్లో పేర్కొంది. అదే సమయంలో జాతీయ గేయాన్ని ఆలపించకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం, కార్యక్రమాన్ని భంగం కలిగించడం శిక్షార్హంగా పరిగణించేలా చట్టంలో మార్పులు చేసింది. జాతీయ గీతానికి సమానంగా 'వందేమాతరం'కు కూడా రక్షణ కల్పించేలా నిబంధనలు తీసుకొచ్చారు. లో రాజకీయ వివాదం స్పష్టంగా కనిపించింది. స్వాతంత్ర్య దినోత్సవం కార్యక్రమంలో మేయర్, ఇతర అధికారులు జనగణమన పాడుతుండగా, అదే సమయంలో బీజేపీ కౌన్సిలర్లు

## కేంద్ర సమన్వయంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాం

మొదటి పేజి తరువాయి

స్వాతంత్ర్యాన్ని కాపాడిందన్నారు. బలమైన, సమర్థ దేశంగా ప్రపంచానికి నాయకత్వం వహించే దిశగా భారత్ అడుగులు వేస్తోందన్నారు. వికసిత్ భారత్ సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ తనదైన పాత్ర పోషిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక ఆకర్షణగా అటవీ, పంచాయతీరాజ్ శకటాలు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కళ్లకు కట్టేలా వివిధ శాఖల శకటాలను రూపొందించారు. ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్



కల్యాణ్ నిర్వహిస్తున్న శాఖల శకటాలు ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన హనుమాన్, గ్రేట్ గ్రీన్ వాల్, గ్రీన్ కవర్ ప్రాజెక్టుల నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో రూపొందించిన పల్లె పండుగ, అడవితల్లిబాట, స్వచ్ఛ రథాలు పల్లెల ప్రగతిని ప్రతిబింబిస్తూ విశేషంగా ఆకర్షించాయి. విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్ర, సాంకేతిక శకటాల్లో 3డీ ప్రింటింగ్ సాంకేతికతతో రూపొందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రం ప్రత్యేకతను చాటుకుంది. విద్యార్థులు తయారు చేసిన రోబో ఉప ముఖ్యమంత్రికి నమస్కరించడం అందరినీ అబ్బురపరిచింది. పోలీసు జాగిలాల ప్రదర్శనలో భాగంగా ఒక జాగిలం పవన్ కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేవాదాయ శాఖ తరఫున రూపొందించిన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నమూనా శకటంతో పాటు నీటిపారుదల, విద్య, వ్యవసాయం, ఉద్యానవన శాఖల శకటాలు వేడుకల్లో ప్రత్యేకంగా నిలిచాయి.

## మనం అడ్రస్ లేనివాళ్లం కాదు.. మన కేరాఫ్ అడ్రస్ అమరావతి: మంత్రి లోకేశ్

మొదటి పేజి తరువాయి

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని మరోసారి స్పష్టం చేశారు. "ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. మనం అడ్రస్ లేని వాళ్లం కాదు.. మన కేరాఫ్ అడ్రస్ అమరావతి" అని ఆయన పునరుద్ఘాటించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.

### ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం

విద్యా వ్యవస్థలో తాము చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయని మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలోనే 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని గర్వంగా ప్రకటించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్లు, డొక్కా సీతమ్మ గారి పేరుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో రాజకీయాలకు తావు లేకుండా చేశామని, పాఠ్యపుస్తకాలపై కానీ, పాఠశాలల వద్ద కానీ ఎక్కడా ముఖ్యమంత్రి లేదా తన ఫోటోలు ఉండవని స్పష్టం చేశారు. చరిత్రలో తొలిసారిగా, పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫోటోలతో ప్రకటనలు ఇచ్చామని గుర్తుచేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును సలహాదారుగా నియమించినట్లు వెల్లడించారు.

### మహనీయుల త్యాగాలను స్మరించుకుందాం

లక్షలాది మంది త్యాగాల ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని లోకేశ్ అన్నారు. మహాత్మా గాంధీ, నేతాజీ సుభాశ్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు, టంగుటూరి ప్రకాశం పంతులు వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని స్మరించుకోవాలని




పిలుపునిచ్చారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ జెండాను ఎగురవేయడం తనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. తన తాత, స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరు మీద ఉన్న జిల్లాలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనడం అరుదైన గౌరవమని తన వ్యక్తిగత ఆనందాన్ని పంచుకున్నారు. విజయవాడ నగరం విద్య, కళలకు నిజమైన రాజధాని అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మన చేతిలో జాతీయ జెండా ఉండాలి - గుండెల్లో బలమైన అజెండా ఉండాలి

మొదటి పేజి తరువాయి

ఎన్సీసీ క్యాడెట్లు, సీఆర్పీఎఫ్, కర్ణాటక పోలీసు దళం మార్చ్ పాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తెలుగు నేల కూడా స్వాతంత్ర్య సమరంలో తనదైన ముద్ర వేసిందన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఏపీ ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యమని అన్నారు. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమేనన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర సాకారం: దేశం మనకు హక్కులు, గుర్తింపు, గౌరవం తీసుకొచ్చిందన్నారు. నా దేశం, నా బాధ్యత అని ముందుకుసాగాలని సూచించారప. దేశం నాకు ఏం చేసిందని కాదు, దేశానికి నేను ఏం చేయగలనని అందరూ ఆలోచించాలని కోరారు. 2047 నాటికి వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 100 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు వికాసం నుంచి వైభవం వైపు ముందుకుసాగాలన్నారు. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యంగా కలిసి అడుగులు వేద్దామని చంద్రబాబు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడు అమరావతి నా రాజధాని అని గర్వంగా చెప్పుకునేలా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా ఉంటామని హెచ్చరించారు. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడితే అదే వారికి చివరి రోజు అవుతుందని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు 26 నెలల్లో సాగునీటి ప్రాజెక్టుల



కోసం దాదాపు రూ. 25 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు.వచ్చే మూడేళ్లలో రూ. 35 వేల కోట్లతో 36 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ గా, బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ- కార్బన్ న్యూట్రల్ , నో పోల్ సిటీ, డీప్ టెక్ క్యాపిటల్ గా అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా నిర్మాణమవుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతియుత వాతావరణం, పెట్టుబడులకు భద్రత కావాలని అన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే చట్టం తన పని తాను చేయాలని అన్నారు. స్వాతంత్ర్యం మనల్ని ఐక్యం చేసిందని, స్వర్ణాంధ్ర మనల్ని దేశంలో నెంబర్ వన్ శక్తిగా నిలబెడుతుందని చంద్రబాబు ఆకాంక్షించారు. 2029 నాటికి అందరికీ ఇళ్లు: నవ్యాంధ్ర యువ ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. యువత కలలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టంచేశారు. ప్రభుత్వం సృష్టించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని అద్భుతాలు సృష్టించాలని సూచించారు. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సాయం అందేలా ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా పనిచేస్తున్నామన్నారు. ఎన్నికల హామీలో చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. తల్లికివందనం సాయాన్ని ఖర్చులా చూడకుండా పిల్లల భవిష్యత్‌పై పెట్టుబడిగా భావిస్తున్నామన్నారు. బీసీలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని తెలిపారు. దశాబ్దాలుగా ఎస్సీలు కోరుకున్న వర్గీకరణను అమలు చేశామన్నారు. 2029 నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలనేది తమ లక్ష్యమని స్పష్టంచేశారు. ప్రభుత్వ భూముల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. 10 సూత్రాలతో విజన్ సాకారం: రాష్ట్రంలో 3 ప్రాంతాలు ఎదిగి, ప్రతీ జిల్లా ప్రగతి సాధించటమే నిజమైన అభివృద్ధి అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సామాజిక న్యాయం జరిగినప్పుడే ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా ముందుకెళుతున్నామని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ లక్ష్యం కోసం 10 సూత్రాలు రూపొందించుకున్నామని సీఎం అన్నారు. పేదరికం లేని సమాజం, ఉద్యోగ ఉపాధి కల్పన, నైపుణ్యం - మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత ఫార్మర్ - అగ్రిటెక్, అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్ అనే ఈ 10 సూత్రాలతో విజన్ సాకారం చేద్దామని చంద్రబాబు ఆకాంక్షించారు. లక్ష్యాలకు తగ్గ కార్యాచరణలో భాగంగా ప్రతి నియోజకవర్గాన్ని ఒక అభివృద్ధి యూనిట్‌గా తీసుకుని విజన్ యాక్షన్ ప్లాన్‌లు రూపొందించామన్నారు. 2014-19 మధ్య 13.5 శాతంగా ఉన్న రాష్ట్ర వృద్ధి రేటు, 2019-24 మధ్య 10.3 శాతానికి పడిపోయిందని విమర్శించారు. అన్ని వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టడంతో వృద్ధి రేటు 11.3 శాతానికి పెరిగిందని సీఎం చంద్రబాబు తెలిపారు.

## రేషన్‌కార్డు కేవలం బియ్యం తెచ్చిపెట్టే సాధనం కాదు - ఎక్కడికెళ్లినా ఆకలి తీర్చే కార్డు

మొదటి పేజి తరువాయి



తమ్ముడు రేవంత్‌రెడ్డిని ఆశీర్వదించడానికి, పాలపిట్ట చీరకట్టుకుని మహిళలు వచ్చారు. ఈసారి మహిళలకు సారె కింద చిలకపచ్చ చీరలు పంపిణీ చేస్తాం. అవి కట్టుకొని, ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకావాలి. గుడి, బడి లేని ఊరు ఉండొచ్చు. ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు మాత్రం ఉండదు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే మహిళల రాజ్యం" - రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి 6 నెలలకు ఒకసారి ఉద్యోగ నోటిఫికేషన్లు : కేసీఆర్ కుటుంబంలో అందరికీ ఉద్యోగాలు వచ్చాయని, రాష్ట్రంలో యువతకు మాత్రం కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వలేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. 6 నెలలకు ఒకసారి ఉద్యోగ నోటిఫికేషన్లు వస్తాయని, నిరుద్యోగులు చదువుకోవాలని కోరారు. నిరుద్యోగులు ఎవరి ప్రలోభాలకు గురికావద్దని సూచించారు. యువతకు ఉద్యోగాలు ఇచ్చి, ఆదుకునే బాధ్యత తమదని హామీ ఇచ్చారు. రేషన్‌కార్డు కేవలం బియ్యం తెచ్చిపెట్టే సాధనం కాదు - ఎక్కడికెళ్లినా ఆకలి తీర్చే కార్డు : సీఎం రేవంత్‌రెడ్డి విధ్వంసం నుంచి వికాసం వైపు : కేసీఆర్ చేసిన రూ.8 లక్షల 11 వేల కోట్ల అప్పులకు ఏడాదికి రూ.75 కోట్ల వడ్డీ కడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తున్నామన్నారు. సంక్షోభంలో ఉన్నా సంక్షేమం కొనసాగిస్తున్నామని చెప్పారు. 12 ఏళ్ల బీజేపీ పాలన, 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలన, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను పోల్చి చూడాలని ప్రజలను కోరారు. ఎల్‌నినో ఉన్నా దేవుడి దయవల్ల కృష్ణా నదిలోకి పుష్కలంగా నీళ్లు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ ఆనందం వ్యక్తం చేశారు. దేవుడి దయ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని, ఎన్ని చేతబడులు చేసినా ఏం కాదన్నారు. "తమిళనాడు, కర్ణాటక పోయి మాజీమంత్రి అఘోర పూజలు చేస్తున్నారు. నాపైన, మా మంత్రుల పైన చేతబడి చేయిస్తే తట్టుకోగలం. రాష్ట్రంలో కరువు రావాలని, ప్రజలు నాశనం అయిపోవాలని అఘోర పూజలు చేయిస్తున్నారు. మీరు ఎక్కడికి వెళ్లినా సోషల్‌మీడియాలో ఫొటోలు పెడతారుగా, శివమొగ్గ పోతే ఎందుకు సోషల్‌మీడియాలో ఫొటో పెట్టలేదు?. బావకు మద్దతుగా బామ్మర్ది వచ్చారు. చేతబడి చేసింది కాంగ్రెస్ నేతలపై కాదు, మాపైనే చేశారని బామ్మర్ది చెప్తున్నారు. ఫామ్‌హౌస్‌లో ఉన్న పెద్దాయన అందుకే బయటకు రావట్లేదు. అధికారం కోసం వారు ఎంతకైనా దిగజారుతారు" - రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకడు : రాహుల్‌గాంధీ రాముడు అయితే జగ్గారెడ్డి హనుమంతుడని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఓడిపోయినా ప్రజల మధ్యే జగ్గారెడ్డి తిరుగుతున్నారని, రూ.1000 కోట్లు ఇచ్చినా జగ్గారెడ్డి లాంటి నాయకుడు దొరకడని రేవంత్ అన్నారు. నాయకులకు మార్కులు వేస్తే, తన కన్నా మంచి మార్కులు జగ్గారెడ్డికి వస్తాయని అన్నారు. "అక్కకిచ్చింది అక్కకిస్తాం, అన్నకిచ్చేది అన్నకిస్తాం. సంగారెడ్డి అక్కకిస్తే, జగ్గారెడ్డికి రాహుల్ గాంధీ ఇంకొకటి ఇస్తారు. ఇక్కడ ఏం జరుగుతుందో నాకు తెలియదు కాని, జగ్గారెడ్డి ప్రజా జీవితంలో ఉండాలి, జగ్గారెడ్డి గెలిచి ఉంటే మీ ప్రాంతానికి ఎంతో మేలు జరిగేది. ప్రభుత్వంలో మంచి పదవిలో ఉండేవారు.

## ఉర్దూలో తిరంగా ధరించారా?' ప్రధాని మోదీ పాకెట్ స్క్వేర్‌పై కాంగ్రెస్ విమర్శలు!

మొదటి పేజి తరువాయి

ఆ జెండా రంగుల అమరిక ఐర్లాండ్ జెండా రంగుల్ని పోలి ఉందనే ఉద్దేశంతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉర్దూలో కుడి నుంచి ఎడమకు రాస్తారు. అందుకే ఉర్దూ గురించి ప్రస్తావించారు. మరో కాంగ్రెస్ నాయకురాలు సుప్రియ శ్రీనాథే కూడా స్పందిస్తూ, 'ఇదేం రకం త్రివర్ణ పతాకం? ఇది తలకిందులుగా ఉంది. భారత జాతీయ జెండా కంటే ఐర్లాండ్ జెండాలానే ఎక్కువగా కనిపిస్తోంది' అని విమర్శించారు. సోషల్ మీడియాలోనూ దీని గురించి చర్చ నడుస్తోంది. అసలు మోదీ ధరించి జాతీయ జెండా కాదని, దానిపై అశోక చక్రం లేదని కొందరు పేర్కొంటున్నారు. కేవలం డిజైన్ కోసమే 3 వరుసగా అమర్చిన 'పాకెట్ స్క్వేర్' మాత్రమేనని కొందరు నెటిజన్లు వివరణ ఇస్తున్నారు.

### 80వ స్వాతంత్ర్య దినోత్సవం- మోదీ ప్రత్యేక లుక్

'ఈ ఏడాది వికసిత్ భారత్ 2047 కోసం యువశక్తి' అనే ప్రత్యేక థీమ్‌తో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని భారత్ ఘనంగా జరుపుకుంది. వికసిత్ భారత్ లక్ష్యంలో యువతను కేంద్రంగా ఉంచుతూ ఈ వేడుకల్ని నిర్వహిస్తున్నారు. ఇండిపెండెన్స్ డే సందర్భంగా ప్రధాని మోదీ వరుసగా 13వ సారి ఎర్రకోటపై నుంచి దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ క్రమంలోనే స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగానికి మోదీ ఎంచుకున్న వస్త్రధారణ మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. మోదీ వేసుకున్న దుస్తుల శైలిని చూస్తే ఆయన తెల్లటి లాంగ్ స్లీవ్



కుర్తా- పైజామాతో పాటు గోధుమ రంగు (బ్రౌన్) నెహ్రూ జాకెట్ ధరించారు. దానికి జేబులోనే త్రివర్ణ పాకెట్ స్క్వేర్‌ను (జేబు రుమాళు) అమర్చారు. ఈ పాకెట్ స్క్వేర్‌నే పవన్ ఖేడా లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంకా పసుపు, తెలుపు రంగుల బాంధనీ డిజైన్‌తో ఉన్న ఎర్రటి రాజస్థానీ తలపాగాను (సఫా) మోదీ ధరించారు. 2014లో తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఏటా స్వాతంత్ర్య దినోత్సవం వేళ భారతదేశానికి చెందిన వివిధ ప్రాంతాల సంస్కృతి, హస్త కళలు, సాంస్కృతిక వైవిధ్యం, చేనేత గొప్పతనాన్ని చాటేలా విభిన్న రంగుల తలపాగాలు ధరించడం మోదీకి కూడా ఒక సంప్రదాయంగా వస్తోంది. ఈసారి కూడా ఆయన లుక్ ప్రత్యేకంగా ఉండి, అందరి దృష్టిని ఆకర్షించింది. 2025లో కూడా మోదీ కాషాయ రంగు తలపాగా, ఇంకా తెల్లటి కుర్తాతో ఆకట్టుకున్నారు.

### మోదీ ప్రసంగంలో హైలైట్స్ ఇవే!

ఇక 70 నిమిషాలకుపైగా సాగిన తన ప్రసంగంలో ప్రధాని మోదీ కీలక విషయాల్ని వెల్లడించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా 'సప్తధార' పేరుతో 7 అంశాల సంస్కరణల రోడ్‌మ్యాప్ ప్రకటించారు. యువత కోసం పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్, కోటి మందికి ఏఐ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో మోదీ 'దిమాగీ నక్సల్స్' గురించి కూడా హెచ్చరించారు.

## ప్రపంచంలో ఏ దేశాన్ని నల్ల బంగారం భూమి అని పిలుస్తారు..? కారణం ఏంటో తెలిస్తే..




ప్రపంచంలో దాదాపు 195 దేశాలు ఉన్నాయి. ప్రతి ఒక్కటి దాని ప్రత్యేక గుర్తింపుకు ప్రసిద్ధి చెందింది. అలాంటి దేశాల్లో నల్ల బంగారం భూమి అని పిలువబడే ఒక దేశం కూడా ఉంది. అవును మీరు విన్నది నిజమే.. అది ఏదేశం..? ఏ దేశానికి నల్ల బంగారం భూమి అనే పేరు వచ్చింది..? దాని వెనుక ఉన్న కారణం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఒక దేశం అత్యంత విలువైన సహజ వనరు అపారమైన నిల్వలను కలిగి ఉన్నప్పుడు దానిని నల్ల బంగారం భూమి అని పిలుస్తారు. ఈ వనరు ముదురు రంగులో ఉంటుంది. బంగారం వలె విలువైనదిగా పరిగణించబడుతుంది. ఇది పెట్రోలియం లేదా ముడి చమురును సూచిస్తుంది. ఇది రవాణా, పరిశ్రమ, దైనందిన జీవితానికి చాలా ముఖ్యమైనది. కొన్ని దేశాలు ఈ వనరులకు అతి పెద్ద నిల్వల కారణంగా అవి మారుపేరును సంపాదించాయి. అలాంటిదే కువైట్. కువైట్ ప్రపంచవ్యాప్తంగా నల్ల బంగారం భూమిగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ, నల్ల బంగారం అనేది పెట్రోలియంను సూచిస్తుంది. చమురు అనేది మిలియన్ల సంవత్సరాల క్రితం భూగర్భంలో పాతిపెట్టబడిన జీవుల అవశేషాల నుండి ఏర్పడిన సహజ వనరు. శుద్ధి చేసిన తర్వాత, దీనిని పెట్రోల్, డీజిల్, గ్యాస్, విమాన ఇంధనం, అలాగే ప్లాస్టిక్‌ల వంటి అనేక ఇతర ముఖ్యమైన ఉత్పత్తులను ఉత్పత్తి చేయడానికి ఉపయోగిస్తారు. ఇవన్నీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఆధునిక జీవితంలో కీలకమైన భాగాలు. అయితే, దీని ఉపయోగం పర్యావరణ ఆందోళనలను కూడా లేవనెత్తుతుంది. అధికారికంగా కువైట్ రాష్ట్రం అని పిలువబడే కువైట్, పశ్చిమ ఆసియాలో ఒక చిన్నది. కానీ, చాలా సంపన్న దేశం. ఇది పర్షియన్ గల్ఫ్‌కు వాయువ్యంగా, ఇరాక్, సౌదీ అరేబియా సరిహద్దులో ఉంది. దాని విస్తారమైన చమురు నిల్వలు కువైట్‌ను అత్యంత ప్రముఖ ప్రపంచ ఆస్తిగా నిలిపింది. చమురు ఆవిష్కరణకు ముందు, కువైట్ ఒక చిన్న వాణిజ్య, మత్స్యకార ప్రాంతంగా పరిగణించబడింది. అయితే, చమురు ఆవిష్కరణ కువైట్ అదృష్టాన్ని మార్చివేసింది. నేడు, చమురు ఆదాయం స్కూల్స్, ఆసుపత్రులు, రోడ్లు, అనేక ప్రభుత్వ ప్రాజెక్టులకు నిధులు సమకూరుస్తుంది. కువైట్‌లో అపారమైన చమురు నిల్వలు ఉన్నాయి. ఇవి రాబోయే చాలా సంవత్సరాలు ఉత్పత్తిని కొనసాగిస్తాయని భావిస్తున్నారు. ప్రపంచ చమురు ధరలు, ఉత్పత్తిని ప్రభావితం చేసే పెట్రోలియం ఎగుమతి చేసే దేశాల సంస్థ (ఒపెక్)లో కువైట్ కూడా సభ్య దేశం. అయితే, కువైట్ చమురులో ఎక్కువ భాగం ఇతర దేశాలకు ఎగుమతి చేయబడుతుంది. ఆధునిక ఓడరేవులు, చమురు టెర్మినల్స్ ఉపయోగించి ఆసియా, యూరప్, మధ్యప్రాచ్య దేశాలకు రవాణా చేయబడుతుంది. ఇది కువైట్ ఆదాయంలో ఎక్కువ భాగాన్ని అందిస్తుంది. ఇంకా, కువైట్ ప్రపంచంలోని ప్రధాన చమురు ఉత్పత్తి దేశాలలో ఒకటి. ప్రతిరోజూ మిలియన్ల బ్యారెళ్ల చమురు ఇక్కడ తవ్వబడుతుంది. బుర్గాన్ చమురు క్షేత్రం ప్రపంచంలోనే అతిపెద్ద వాటిలో ఒకటి. ఇది కువైట్ ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదపడుతుంది. కువైట్ పశ్చిమ ఆసియాలో వాయువ్య పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న ఒక చిన్నదేశం. కానీ అత్యంత సంపన్న దేశం. ఇది ఇరాక్, సౌదీ అరేబియా సరిహద్దులను కలిగి ఉంది. కువైట్ పార్లమెంట్‌తో కూడిన రాజ్యాంగ రాచరికం. దాని రాజధాని కువైట్ నగరం. దాని ఆధునిక ఎత్తైన భవనాలు, సందడిగా ఉండే మార్కెట్లు, ఆధునిక జీవనశైలికి ప్రసిద్ధి చెందింది. గణనీయమైన సంఖ్యలో విదేశీ కార్మికులతో సహా దేశ జనాభాలో ఎక్కువ మంది ఇక్కడ నివసిస్తున్నారు.

# భారీగా పెరగనున్న రీఛార్జ్ ధరలు..
# ఈ నెల నుంచే అమల్లోకి..! ఒకేసారి ఎంతంటే..?

రీఛార్జ్ ధరలు భారీగా పెరగనున్నాయి. ఈ మేరకు ముహూర్తం కూడా ఖరారు అయింది. దీంతో మొబైల్ వినియోగదారులపై భారం మరింత పెరగనుంది. ఇప్పటికే రీఛార్జ్ ధరలు షాక్ కొడుతుండగా.. మరింత పెరగడం వల్ల సామాన్యులపై భారం పెరగనుంది. ఎంత వరకు పెరుగుతున్నాయంటే..మొబైల్ వినియోగదారులకు త్వరలో బిగ్ షాక్ తగలనుంది. రీఛార్జ్ ధరలను 2026లో టెలికాం కంపెనీలు పెంచనున్నాయని ఎప్పటినుంచో వార్తలు వినిపిస్తున్నాయి. జనవరిలోనే రీఛార్జ్ ధరలు పెరుగుతాయని వార్తలు రావడంతో ఈ నెలలోనే పెంపు ఉంటుందని అందరూ ఊహించారు. కానీ టెలికాం కంపెనీలు మరికొంత సమయం తీసుకోనున్నాయని తెలుస్తోంది. 2024లో రీఛార్జ్ ధరలను భారీగా పెంచగా.. రెండేళ్ల తర్వాత ఇప్పుడు పెంచేందుకు కంపెనీలు సిద్ధమవుతున్నాయి. దీంతో ఈ సారి భారీగా పెరగనున్నాయని సమాచారం. 5జీ విస్తరణ, ఏఐ టెక్నాలజీని ప్రవేశపెట్టేందుకు టెలికాం కంపెనీలకు భారమవుతుంది. దీంతో ప్రయాణికులపై భారం వేసేందుకు కంపెనీలు రెడీ అవుతున్నాయి.

### జూన్‌లో పెంపునకు సిద్ధం

టెలికాం కంపెనీలు అన్నీ మూకుమ్మడిగా రీఛార్జ్ ధరలను పెంచేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నాయి. జూన్‌లో రీఛార్జ్ ధరలను పెంచనున్నాయని ఆర్థిక సేవల సంస్థ జెఫ్రీస్ తన రిపోర్టులో పేర్కొంది. ఏకంగా 15 శాతం వరకు పెంచనున్నట్లు తెలిపింది. త్వరలో జియో పబ్లిక్ ఐపీఓకు లిస్ట్ కానుంది. భారీగా నిధులు సమీకరించనుండగా.. దేశంలోనే ఇప్పటివరకు ఇదే అతిపెద్ద ఐపీఓకు చెబుతున్నారు. దీని వల్ల టెలికాం రంగంలో మార్కెట్ వాల్యుయేషన్ పెరుగుతుందని జెఫ్రీస్ సంస్థ తన నివేదికలో పొందుపర్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో టెలికాం రంగం ఆదాయ వృద్ధి 16 శాతానికి చేరుకోవచ్చని అంచనా వేసింది. ఇక పోస్ట్ పెయిడ్, డేటా వినియోగం కూడా పెరగడంతో టెలికాం కంపెనీలకు కూడా ఆదాయం పెరుగుతున్నట్లు పేర్కొంది.



### జియో ఎంత పెంచనుందంటే..?

జియో దాదాపు 10 నుంచి 20 శాతం వరకు మొబైల్ రీఛార్జ్ ధరలను పెంచనుందని తెలుస్తోంది. ఇక ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా కూడా ఇదే స్థాయిలో పెంచనున్నాయి. దీని వల్ల మొబైల్ వినియోగదారులపై మరింత భారం పెరగనుంది. ఇప్పటికే జియో, ఎయిర్ టెల్, వొడాఫోన్ ఐడియా రీఛార్జ్ ధరలు అధికంగా ఉన్నాయి. ఇక ఇప్పుడు మరింత పెంచితే సామాన్యులకు రీఛార్జ్ ధరలు షాక్ కొట్టనున్నాయి. ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ వినియోగదారులకు భారం కానుంది. 2024లో మధ్యలో కంపెనీలు టారిఫ్ ధరలను 15 శాతం వరకు పెంచాయి. అయితే బీఎస్ఎన్ఎల్ మాత్రం పెంచలేదు. ఇప్పుడు కూడా బీఎస్ఎన్ఎల్ పెంచేందుకు సిద్ధంగా లేదు. 5జీని దేశవ్యాప్తంగా విస్తరణ చేసేందుకు కొత్త టవర్ల ఏర్పాటుకు కంపెనీలకు భారీగా నిధులు అవసరం అవుతున్నాయి. అలాగే ఏఐని అందిపుచ్చుకునేందుకు నిర్వహణ ఖర్చు ఎక్కువవుతుంది. దీంతో కస్టమర్లకు మెరుగైన సేవలు అందించేందుకు రీఛార్జ్ ధరలను పెంచక తప్పదని రీఛార్జ్ కంపెనీలు చెబుతున్నాయి. మరి రీచార్జ్ ధరల ప్రభావం సామాన్యులపై ఎలా ఉంటుందో చూడాలి.

## దేశంలో మరో కొత్త రైలు పరుగులు.. సౌండ్ లేదు, పొగరాదు.. టికెట్ ధర తెలిస్తే ఎగిరి గంతేస్తారు..!




ఎలాంటి శబ్దం ఉండదు. ఏ మాత్రం పొగ రాదు..ఈ నెల నుండి భారతదేశంలో ఒక కొత్త రైలు అందుబాటులోకి రానుంది. ఇది వేగంలో వందే భారత్ రైళ్లతో పోటీ పడనుంది. లక్షణాలలో శతాబ్ది ఎక్స్‌ప్రెస్ వంటి ప్రీమియం రైళ్లకు ధీటుగా నిలుస్తుంది. కానీ, ఛార్జీల పరంగా అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. అంతేకాదు.. ప్రపంచంలోనే అతి పొడవైన వాయుశక్తితో నడిచే రైలు భారతదేశంలో నడుస్తుంది. దాని మార్గం, వేగం, స్టాప్‌ల వివరాలేంటో పూర్తి సమాచారం ఇక్కడ చూద్దాం... భారతదేశపు మొట్టమొదటి హైడ్రోజన్ రైలు 2026 జనవరి 26న సర్వీసును ప్రారంభించే అవకాశం ఉంది. అయితే, అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. ట్రయల్ రన్‌లు పూర్తయ్యాయి. విమాన ప్రయాణాన్ని పోలిన అనుభవాన్ని అందించే ఈ సైలెంట్ ట్రైన్ త్వరలో జింద్-సోనిపట్ రూట్‌లో నడుస్తుంది. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (×జఖీ)లో తయారు చేయబడిన ఈ హైడ్రోజన్ రైలు 356 కి.మీ. దూరాన్ని కవర్ చేస్తుంది. దీని సేవను క్రమంగా విస్తరించనున్నారు. ఒకేసారి 2,600 మందికి పైగా ప్రయాణికులను తీసుకెళ్లగల ఈ రైలు రెండు ట్రిప్పులు నడుస్తుంది. దీని వేగం గంటకు 150 కి.మీ.కు చేరుకుంటుంది. ఈ రైలు భారతదేశంలో నడుస్తున్న ప్రపంచంలోనే అతి పొడవైన హైడ్రోజన్ రైలు అవుతుంది. ప్రతి కిలోగ్రాము హైడ్రోజన్ 2 కి.మీ. దూరాన్ని కవర్ చేస్తుంది. హైడ్రోజన్ రైలు కోచ్‌లలో ఉష్ణోగ్రత సెన్సార్లు, ఆధునిక టాయిలెట్లు, వాష్‌బేసిన్‌లు అమర్చబడి ఉంటాయి. సౌకర్యవంతమైన నీలిరంగు పరుపులు, ఆధునిక సీలింగ్ ఫ్యాన్లు, ఎల్ఈడీ లైట్ ప్యానెల్‌లు ఏర్పాటు చేశారు. మెట్రో మాదిరిగానే రైలులో స్లైడింగ్ డోర్లు, ఆధునిక బయో-టాయిలెట్లు ఉన్నాయి. రైలు నేవీ బ్లూ, వైట్ రంగులలో అలంకరించబడింది. ఇకపోతే, ఈ హైడ్రోజన్ రైలు మొదట్లో సోనిపట్, జింద్ మధ్య నడుస్తుంది. ఈ రైలు వేగం గంటకు 110 నుంచి 150 కిలోమీటర్ల మధ్య ఉంటుంది. కనీస ఛార్జీ రూ. 5 గరిష్ట ఛార్జీ రూ. 25 ఉంటుందని అంచనా. అయితే అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

### ఏ ఏ రూట్లలో నడుస్తుంది..?

దేశంలోనే అతి పొడవైన హైడ్రోజన్ రైలు మార్గం జింద్- సోనిపట్ మధ్య ఉంటుంది. దీనిలో మార్గంలో నాలుగు నుండి ఐదు స్టాప్‌లు ఉంటాయి. ఈ హైడ్రోజన్ రైలు డీజిల్ లేదా విద్యుత్తుతో నడవదు. ఇది నీటితో నడిచే రైలు. నీటిని హైడ్రోజన్ వాయువు, ఆక్సిజన్‌గా విభజించడం ద్వారా ఉత్పత్తి అయ్యే శక్తితో నడుస్తుంది. ఈ ప్రక్రియ ఎటువంటి కాలుష్యాన్ని ఉత్పత్తి చేయదు. ఇది పూర్తిగా కాలుష్య రహితంగా పనిచేస్తుంది.

## కేవలం ఒక్క రూ.1 రీఛార్జ్‌తో నెల రోజులు ఫ్రీ కాల్స్, ఇంటర్నెట్.. పండుగ వేళ ఇండస్ట్రీని షేక్ చేసే ఆఫర్..




సంక్రాంతి పండుగ వేళ బీఎస్ఎన్ఎల్ అదిరిపోయే ఆఫర్‌ను తీసుకొచ్చింది. రూ.1కే నెల రోజుల పాటు ఉచితంగా కాల్స్, ఇంటర్నెట్ వాడుకునే ఆఫర్ ప్రవేశపెట్టింది. దీంతో ఈ ఆఫర్ పొందేందుకు చాలామంది ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. అసలు ఈ ఆఫర్ వివరాలు ఏంటి? అనేది చూద్దాం ప్రముఖ టెలికాం రంగం సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ తమ కస్టమర్లకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఫ్రీడమ్ ప్లాన్‌ను మళ్లీ తీసుకొచ్చింది. ఈ ఆఫర్ కింద రూ.1కే కొత్త సిమ్ కార్డ్ అందించనుంది. రూపాయికే సిమ్ కార్డు మాత్రమే కాకుండా నెల రోజుల పాటు ఉచితంగా అన్‌లిమిటెడ్ కాల్స్ అందించనుంది. అలాగే 30 రోజుల పాటు రోజుకు 2జీబీ హైస్పీడ్ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు లభించనున్నాయి. అంటే కేవలం ఒక్క రూపాయికే నెల రోజుల పాటు మీరు ఫ్రీగా కాల్స్, ఇంటర్నెట్ సౌకర్యం పొందవచ్చు. జనవరి 31 వరకు ఈ ఆఫర్ అందుబాటులోకి ఉండనుందని బీఎస్ఎన్ఎల్ ఎక్స్ అకౌంట్‌లో స్పష్టం చేసింది. ఈ ఆఫర్ వివరాలు చూస్తే..

### రూ.1కే అన్నీ

"వేడుక ముగిసింది. కానీ ఇంకా ఆనందం అయిపోలేదు. కేవలం రూ.1కే ఉచితంగా బీఎస్ఎన్ఎల్ సిమ్ పొందండి. అన్‌లిమిటెడ్ కాల్స్‌తో పాటు రోజుకు 2జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు పొందండి. 30 రోజుల పాటు ఫ్రీగా ఉపయోగించుకోండి. జనవరి 31 వరకు ఆఫర్ అందుబాటులో ఉంటుంది. సమీపంలోని బీఎస్ఎన్ఎల్ సీఎస్సీ లేదా రిటైలర్‌ను సంప్రదించి సిమ్ తీసుకోండి అంటూ"ఎక్స్‌లో పేర్కొంది. కొత్తగా సిమ్ తీసుకునే కస్టమర్లతో పాటు బీఎస్ఎన్ఎల్‌లోకి పోర్టబులిటీ అయ్యేవారికి ఈ ఆఫర్ వర్తిస్తుంది. ఇప్పటికే బీఎస్ఎన్ఎల్ కస్టమర్లు అయి ఉంటే ఆఫర్ వర్తించదు.

### పండుగ ఆఫర్లు

సంక్రాంతి, రిపబ్లిక్ డే వస్తున్న క్రమంలో బీఎస్ఎన్ఎల్ ఆఫర్ తీసుకొచ్చింది. జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా గ్రాండ్‌గా జరుపుకునేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతీ ఏడాది రిపబ్లిక్ డే, స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ఫ్రీడమ్ ఆఫర్‌ను బీఎస్ఎన్ఎల్ తెస్తూ ఉంటుంది. అందులో భాగంగా మళ్లీ ఇప్పుడు గణతంత్ర దినోత్సవం సందర్భంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే ప్రైవేట్ టెలికాం రంగం సంస్థలైన ఎయిర్‌టెల్, జియో, వొడాఫోన్ ఐడియాకు పోటీగా బీఎస్ఎన్ఎల్ నిలుస్తోంది. ఆ కంపెనీల రీఛార్జ్ ధరలు అధికంగా ఉన్నాయి. త్వరలోనే రీఛార్జ్ ధరలను పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. అయితే వాటితో పోలిస్తే బీఎస్ఎన్ఎల్ రీఛార్జ్ ధరలు తక్కువగా ఉన్నాయి. త్వరలో 5జీ నెట్‌వర్క్‌ను కూడా అన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు బీఎస్ఎన్ఎల్ రెడీ అవుతోంది. దీంతో చాలామంది మళ్లీ బీఎస్ఎన్ఎల్ వైపు ఆకర్షితులు అవుతున్నారు. దీంతో బీఎస్ఎన్ఎల్‌కు క్రమక్రమంగా కస్టమర్లు పెరుగుతున్నారు.

## ఈపీఎఫ్‌వో ఉద్యోగులకు అలర్ట్.. అప్డేట్ రూల్స్ అన్నీ ఛేంజ్.. కొత్త మార్పులు ఇవే..




ఈపీఎఫ్‌వో ఖాతాదారులకు భారీ శుభవార్త. ఇక నుంచి మీ పీఎఫ్ అకౌంట్లోని వివరాలను ఈజీగా అప్‌డేట్ చేసుకోవచ్చు. కొన్ని వివరాలు అప్డేట్ చేసుకోవడానికి ఎలాంటి డాక్యుమెంట్స్ కూడా అవసరం ఉండదు. ఈ మేరకు ఈపీఎఫ్‌వో తాజాగా నిర్ణయం తీసుకుంది. ఆ వివరాలు ఇలా..ఉద్యోగుల భవిష్య నిధి పథకం(ఈపీఎఫ్‌వో) ఎప్పుడూ ఏవోక రూల్స్ మారుస్తూ ఉంటుంది. ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చేలా ఎప్పటికప్పుడు నిబంధనల్లో మార్పులు తెస్తూ ఉంటుంది. మరింత సులభతరం, పాదర్శకతతో సేవలు అందించేందుకు కొత్త రూల్స్ తీసుకొస్తూ ఉంటుంది. తాజాగా ఈపీఎఫ్ ఖాతాలో వ్యక్తిగత వివరాలు అప్డేట్‌కు సంబంధించి పలు మార్పులు చేస్తోంది. పేరు, లింగం, తండ్రి పేరు, పుట్టిన తేదీ, నేషనాలిటీ వంటి వివరాలు మార్చుకునే ప్రక్రియను మిరింత ఈజీ చేసింది. వీటిని మార్చుకోవాలంటే ఏం చేయాలి? ఎలాంటి పత్రాలు సమర్పించాలి? అనే వివరాలు ఇప్పుడు చూద్దాం.

### వీటిని అప్డేట్ చేసుకోవచ్చు

పేరు, తండ్రి లేదా తల్లి పేరు, డేట్ ఆఫ్ బర్త్, మ్యారేజ్ వివరాలు, నేషనాలిటీ, ఉద్యోగంలో చేరిన తేదీ, ఎగ్జిట్ అయిన తేదీ వివరాలను ఉద్యోగులు మార్చుకోవచ్చని ఈపీఎఫ్‌వో తాజాగా ఓ సర్క్యులర్ జారీ చేసింది. వీటిని ఖాతాదారులు ఆన్‌లైన్‌లో అవసరమైన ధృవీకరణ పత్రాలు అందించి మార్చుకోవచ్చని స్పష్టం చేసింది.

### నేషనాలిటీ మార్చుకోవడం ఎలా..?

ఇక నుంచి ఈపీఎఫ్‌వో అకౌంట్లో నేషనాలిటీ తప్పుగా ఎంటర్ అయినా సులువుగా మార్చుకోవచ్చు. మీ యూఏఎన్ నెంబర్ అక్టోబర్ 1,2017 కంటే ముందే యాక్టివేట్ చేసి ఉండాలి. అలాగే ఈపీఎఫ్ అకౌంట్లో మీ ఆధార్ వివరాలు వెరిఫికేషన్ పూర్తయి ఉండాలి. ఈ రెండు పనులు చేసి ఉంటే మీరు జాతీయత, పేరు, తల్లిదండ్రుల పేర్లను సులువుగా మార్చుకోవచ్చు. ఇందుకోసం ఎలాంటి డాక్యుమెంట్స్ ఇవ్వాల్సిన అవసరం లేదు. మీరు అప్డేట్ చేశాక యాజమాన్యం ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇక మీ ప్రొఫైల్‌లో జాతీయ కాలం ఖాళీగా ఉంటే వెంటనే సులభంగా అప్డేట్ చేసుకోవచ్చు. ఆ తర్వాత భారత పౌరసత్వం నుంచి అంతర్జాతీయ పౌరసత్వం పొందినప్పుడు మాత్రమే నేషనాలిటీ మార్చుకోవడానికి వీలవుతుంది.

### అప్డేట్ చేసుకోకపోతే..

మీ ఈపీఎఫ్‌వో ప్రొఫైల్‌లో వివరాలు తప్పుగా నమోదు అయి ఉంటే మీకు ఇబ్బందులు ఎదురవుతాయి. మీరు క్లెయిమ్ చేసుకునే సమయంలో సమస్యలు ఎదురవుతాయి. వివరాలు తప్పుగా ఉంటే క్లెయిమ్ రిజెక్ట్ అవుతుంది. అలాగే పెన్షన్ పెందాలనుకున్నప్పుడు కూడా సమస్యలు వచ్చే అవకాశముంది. అందువల్ల ఎప్పుటికప్పుడు మీరు పీఎఫ్ అకౌంట్ ఓపెన్ చేసి వివరాలను చెక్ చేసుకుంటూ ఉండాలి. తప్పుగా ఉంటే మార్చుకోవడానికి వెంటనే రిక్వెస్ట్ పెట్టుకోవాలి. మీ యాజమాన్యం మీ వివరాలను ధృవీకరిస్తే సరిపోతుంది. ఇక బ్యాంక్ అకౌంట్ వంటి వివరాలను బ్యాంక్ ధృవీకరించాల్సి ఉంటుంది. ఇప్పుడు ఉద్యోగులు వివరాలను అప్డేట్ చేసుకునే ప్రక్రియ మరింత సులభతరం అయిందని చెప్పవచ్చు.

## బంగారం, వెండిని ఇలా కొన్నారంటే.. మీ సంపద 3 రెట్లు పెరిగినట్టే..!




బంగారం, వెండి ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో, స్మార్ట్ పెట్టుబడి పద్ధతులు అధిక లాభాలను ఆర్జించేందుకు దోహదపడతాయి. ఆభరణాలు, నాణేలు వంటి భౌతిక రూపాల కన్నా గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లు మెరుగైన ఎంపిక. తక్కువ ఖర్చు, సులభమైన కొనుగోలు-అమ్మకం, నిల్వ సమస్యలు లేకపోవడం, నియంత్రణ వంటి ప్రయోజనాలతో ఈటీఎఫ్‌లు అధిక రాబడికి సురక్షితమైన మార్గం. ఇటీవలి రోజుల్లో బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి. సామాన్య మధ్య తరగతి ప్రజలు బంగారం కొనాలంటే బెంబేలెత్తిపోయే పరిస్థితి నెలకొంది. కానీ, పెట్టుబడిదారులు మాత్రం ఇదే అదునుగా పసిడిపై భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. దీంతో ధరలు మరింతగా ఆకాశన్నంటుతున్నాయి. వెండి, గోల్డ్ ధరలు విపరీతంగా పెరుగుతున్న ఈ సమయంలో మీరు సరైన పెట్టుబడి పద్ధతిని ఎంచుకుంటే తక్కువ ఖర్చుతో పెద్ద లాభాలను ఆర్జించవచ్చని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సరైన పద్ధతిలో చేస్తే మీరు ఆదా చేసుకున్న డబ్బుపై ఊహించనంత లాభం పొందుతారు. అదేలాగో ఇక్కడ తెలుసుకుందాం.. సాధారణంగా బంగారం, వెండిలో పెట్టుబడి పెట్టేవారు ఆభరణాలు, నాణేలు, బిస్కెట్లను ఎంచుకుంటారు. కానీ, ఇటీవల నిపుణులు బంగారం, వెండి జుఖీలు (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్) మెరుగైన, సులభమైన పెట్టుబడి ఎంపిక అని సూచిస్తున్నారు. జుఖీల ప్రధాన ప్రయోజనాలు తక్కువ ధర, సులభంగా కొనుగోలు చేయడం, అమ్మడం లేదంటే, నిల్వ చేయడంలో ఇబ్బంది లేకపోవడం. బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు మెకింగ్ చార్జీలు పెద్ద భారంగా మారుతుంది. అలాగే, అమ్మేయాలనుకుంటే.. మనం పెట్టిన పెట్టుబడి పూర్తిగా తిరిగి రాదు. దీని వలన ఆభరణాలు లాభదాయకమైన పెట్టుబడి కాదని నిపుణులు అంటున్నారు. ఈ సంవత్సరం జనవరి నుండి డిసెంబర్ వరకు బంగారం ధర 82 శాతం, వెండి ధర 175 శాతం పెరిగింది. జనవరి 1న 10 గ్రాముల బంగారం ధర రూ. 76,772 ఉండగా, డిసెంబర్ 26న రూ. 1,39,890కి చేరుకుంది. అదేవిధంగా, వెండి ధర కిలోకు రూ. 87,300 నుంచి రూ. 2,40,300కి పెరిగింది. జుఖీల ద్వారా పెట్టుబడి పెట్టడం వలన మీరు తీసుకున్న గోల్డ్ క్యారెట్ స్వచ్ఛత, తక్కువ కొనుగోలు చార్జీలు, అధిక ద్రవ్యత లభిస్తాయి. డీమ్యాట్ ఖాతా ద్వారా స్టాక్‌ల మాదిరిగానే జుఖీలను కొనుగోలు చేయవచ్చు లేదా విక్రయించవచ్చు, అవసరమైనప్పుడు నిధులను సులభంగా యాక్సెస్ చేయవచ్చు. డిజిటల్ గోల్డ్ కూడా ప్రజాదరణ పొందుతున్నప్పటికీ, ఇది సెబీ నియంత్రణలో ఉన్న ఉత్పత్తి కానందున కొన్ని నష్టాలు ఉన్నాయి. అందువల్ల, సెబీ నియంత్రణలో ఉన్న బంగారం, వెండి ఇటిఎఫ్‌ల ద్వారా పెట్టుబడి పెట్టడం సురక్షితమైన ఎంపిక అని నిపుణులు సూచిస్తున్నారు.

## త్వరలో రైతులందరికీ అకౌంట్లోకి రూ.2 వేలు.. మీకు వస్తాయో..? రావో? ఇలా చెక్ చేసుకోండి..



దేశవ్యాప్తంగా రైతులందరికీ కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. ఫిబ్రవరిలో పీఎం కిసాన్ నిధులను విడుదల చేయనుంది. ఈ మేరకు రూ.2 వేలు రైతుల అకౌంట్లో నేరుగా జమ చేయనుంది. ఈ క్రమంలో మీకు అందుతాయో.. లేదో చెక్ చేసుకోవడం ఎలా అంటే.. దేశంలోని రైతులందరికీ త్వరలో కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించనుంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులను త్వరలోనే రైతుల ఖాతాల్లోకి జమ చేసేందుకు సిద్ధమవుతోంది. ఫిబ్రవరిలో పీఎం కిసాన్ నిధులను కేంద్రం రైతుల అకౌంట్లలో నేరుగా జమ చేయనుంది. ఇందుకోసం ప్రాసెస్ జరుగుతుండగా.. ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పటిలాగే స్వయంగా తన చేతుల మీదుగా పీఎం కిసాన్ నిధులను విడుదల చేయనున్నారు. ప్రతీ ఏడాది ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు రూ.6 వేల సహాయం అందిస్తోంది. వీటిని రూ.2 వేల చొప్పున మూడు విడతలుగా జమ చేస్తున్నారు. నాలుగు నెలలకు ఒకసారి రూ.2 వేల చొప్పున వీటిని విడుదల చేస్తూ వస్తోంది. 5 ఎకరాల్లోపు పోలం ఉన్న రైతులకు మాత్రమే ఈ పథకం ద్వారా లబ్ది చేకూర్చుతోంది ఫిబ్రవరిలో నిధులు విడుదల దాదాపు దేశవ్యాప్తంగా 9 కోట్ల మంది రైతులు పీఎం కిసాన్ లబ్దిదారులుగా ఉన్నారు. 22వ విడత డబ్బులను ఫిబ్రవరిలో విడుదల చేసేందుకు ముహూర్తం ఫిక్స్ అయిన క్రమంలో లబ్దిదారులు మీకు పీఎం కిసాన్ నిధులు వస్తాయా.. లేదా అనేది ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు. పీఎం కిసాన్ వెబ్ సైట్ లేదా యాప్ ద్వారా చెక్ చేసుకోవచ్చు. ఒకవేళ మీకు రాకపోతే ఎందుకు రాలేదనే రీజన్ కూడా మీరు తెలుసుకోవచ్చు. ఇటీవల అనర్హులుగా తేలిన కొంతమంది రైతులను లబ్దిదారుల జాబితా నుంచి కేంద్ర ప్రభుత్వం తొలగించింది. మీ పేరు లబ్దిదారుల జాబితాలో ఉంటేనే నగదు జమ అవుతాయి మీకు డబ్బులు వస్తాయో..? రావో? చూసుకోవడమెలా.. వెబ్‌సైట్లోకి వెళ్లాలి -ఖఅశీఱ శిబతీ ౕఙబం ఆప్షన్ ఎంచుకోవాలి -రిజిస్ట్రేషన్ నెంబర్ లేదా మొబైల్ నెంబర్ ఎంటర్ చేయాలి -ఆ తర్వాత సబ్మిట్ క్లిక్ చేయాలి -22వ ఇనాస్టాల్‌మెంట్ మీకు వస్తుందో రాదో అక్కడ తెలుసుకోవచ్చు. లబ్దిదారుల జాబితా చెక్ చేయాలంటే..? వెబ్‌సైట్ ఓపెన్ చేయండి ఆప్షన్ ఎంచుకుని దీవఅవటఱఎఱుతీఎ ాఱర్‌పై క్లిక్ చేయాలి. -మీ రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామం ఎంచుకోవాలి -గెట్ రిపోర్ట్‌పై క్లిక్ చేయాలి మీ గ్రామంలోని లబ్దిదారుల జాబితా వస్తుంది మీ పేరు ఉందో.. లేదో చెక్ చేసుకోండి కేవైసీ చేసుకోండి ఒక్కొసారి కేవైసీ పెండింగ్‌లో ఉండటం వల్ల మీ అకౌంట్లో డబ్బులు పడవు. అందుకే బ్యాంక్‌కు వెళ్లి కేవైసీ పూర్తి చేయాలి. ఇందుకోసం మీ బ్యాంక్ అకౌంట్‌తో లింక్ అయిన ఆధార్ నెంబర్ ఓటీపీ చెప్పాల్సి ఉంటుంది.

# ఎస్టిపిపి లో ఘనంగా జెండా పండుగ





జైపూర్,: జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టిపిపి)లో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఎస్టిపిపి ఈడి సిహెచ్.చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఈడి చిరంజీవి మాట్లాడుతూ.. ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను ధారపోసి,నిర్విరామ పోరాటాలు చేసి మన దేశానికి స్వాతంత్రం సాధించి పెట్టిన ఆ చిరస్మరణీయ సమరయోధులకు,దేశ రక్షణ కోసం తమ ప్రాణ త్యాగాలు చేసిన వీరులకు నివాళులర్పించారు.79 సంవత్సరాల ప్రగతి ప్రస్థానం పూర్తి చేసుకుని,80 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా వారి త్యాగాలను స్మరించుకున్నారు.మన స్వతంత్ర భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ప్రగతి పదంలో ముందుకు పోవడం మనందరం గర్వించదగ్గ విషయం అన్నారు.ఈ దేశాభివృద్ధిలో మన సింగరేణి సంస్థ అలాగే మన సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కూడా పాలుపంచుకోవడం మనకు గర్వ కారణమని తెలియజేశారు.సింగరేణి సంస్థ సి &ఎండి డా.బుద్ధ ప్రకాష్ జ్యోతి,ఐఎఎస్.ఆధ్వర్యంలో సింగరేణి ప్రగతి పథంలో ముందుకెళ్తుందని అన్నారు.సి &ఎండి కృషి,రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాల చొరవతో సింగరేణి కి తాడిచర్ల ఓసి -2 బొగ్గు గని,మణుగూరు డీప్ సైడ్ బ్లాక్ దక్కడం మన సంస్థ మనుగడకు చాలా మేలు చేస్తుందన్నారు.అలాగే మన నైని బొగ్గు గని నుండి తెలంగాణ రాష్ట్రానికి తొలిసారిగా మన తెలంగాణకు అందులో మన ఎస్టిపిపి కి బొగ్గు రైల్వే రేకు రావడం జరిగిందని,30 సంవత్సరాల గని జీవితం కలిగిన ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు.ఇలా సింగరేణి దిన దిన అభివృద్ధి చెందుతూ తద్వారా రాష్ట్ర,దేశ అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.సింగరేణి వ్యాప్తంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ,కార్మిక శ్రేయస్సు,వారి ఆరోగ్యం మరియు వారి కుటుంబాల విద్య అవసరాలు తీరుస్తూ గత 13ట సంవత్సరాలుగా మన సంస్థ అందరి సహకారంతో ముందుకు పోతున్నదన్నారు.అలాగే కంపెనీ సిఎస్ఆర్ నిధులతో పలు గ్రామాలలో అభివృద్ధి పనులు నిర్వహించడం జరిగిందని,ఇది నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.సింగరేణి ఉద్యోగులుగా మనందరం కంపెనీ ప్రగతికి పాటుపడుతూ,రాష్ట్ర అభివృద్ధికి,దేశ ప్రగతికి తమ వంతు కృషి చేయాలని కోరుతూ మరొకసారి ఉద్యోగులందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలోనే ఉత్తమ ఉద్యోగులుగా లక్కోజు బాలసుబ్రహ్మణ్యం సీనియర్ అసిస్టెంట్,అడ్డూరి కిరణ్ కుమార్ వార్డ్ అసిస్టెంట్ లను పూలమొక్క,శాలువాతో సత్కరించడం ప్రశంసా పత్రం,మేమెంటో అందజేయడం జరిగింది.ఉత్తమ సింగరేణియన్ గా మెరుగు రాజ్ కుమార్,సీనియర్ అసిస్టెంట్ ని కొత్తగుడెంలోని ప్రకాశం స్టేడియం లో జరిగిన సెంట్రల్ ఫంక్షన్ లో సి &ఎండి,డైరెక్టర్ ల చేత సత్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిఎం (పిసిఎస్ ) కే.సూర్య నారాయణ రాజు,సీఐఎస్ఎఫ్ కమాండెంట్ చంచల్ సర్కార్,ఏఐటియుసి పిట్ సెక్రెటరీ సిహెచ్.సత్యనారాయణ ,సిఎంఓఎఐ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ పి.అప్పారావు,ఏజిఎం (ఫైనాన్స్) బి.శ్రీధర్,పర్సనల్ విభాగాధిపతి ఎస్వి రాజేశ్వర్ రావు,ఇతర అధికారులు,ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

# జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహణ



కొమురం భీం ఆసిఫాబా: మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు పెద్దపల్లి కిషన్ రావు పటేల్ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ సమైక్యత, దేశభక్తి మరియు ఐక్యతకు ప్రతీకగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు గాజుల జక్కయ్య, గడ్డల సురేష్, పొలంపెల్లి గణపతి, మణిగొండ వెంకటేష్, గజ్జల వినోద్, ఏపూరి శ్యామ్, గంగిశెట్టి వేణు, కుందరపు సత్యనారాయణ, దేగల రామకృష్ణ, వెంకట స్వామి, బద్రి సాయి, గాజుల వెంకన్న, మామిడి సతీష్, గాజుల గురుమూర్తి, బోరిగం సీతారామ్ సాయి, దేగల సురేందర్, ఎమ్మాజీ పెంటయ్య, తోగరి బందు, ఎరువోతు సుధాకర్, కుందరపు గోపాల్, ఉప్పు సంపాతి, కలికోట రమణయ్య, రుకుం ప్రహ్లద్, తులసిగారి రాజన్న, ఏళ్లకుల పోషణ, గాజుల కృపాల్, కవ్వల నరేష్, రుకుం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ అభివృద్ధి, జాతీయ సమైక్యత, సామాజిక అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అలాగే మున్నూరు కాపు సంఘం ఐక్యతను మరింత బలోపేతం చేస్తామని ఆకాంక్షించారు...

## తిర్యాణిలో ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాల్లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



తిర్యాణి, : తిర్యాణి మండల కేంద్రంలోని ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాల్లో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధికారులు, సిబ్బంది జాతీయ జెండాను ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ.



భీమారం : భీమారం మండల కేంద్రంలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు గర్రెపల్లి సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘము భీమారం మండల అధ్యక్షులు గర్రెపల్లి సత్యనారాయణ, మేరడిగొండ మురళి, చెన్నోజీ మనోహర్,రుద్ర శర్మ, నూతి శంకరయ్య,కిరాణ్యబాబు,కాటారం తిరుపతి,వేముల ప్రణీత్ గౌడ్ నాయకులు ఉష్కమల్ల పున్నం చంద్, శ్రీనివాస్, జర్పుల రాజ్ కుమార్ నాయక్, పోడేటి రవి, గుండు తిరుపతి,సత్తి రెడ్డి,కొత్తపల్లి శంకర్, కంకణాల సుధాకర్ రెడ్డి, కోల కిష్టయ్య శంకర మూర్తి, పోటు మురళి తదితరులు పాల్గొన్నారు.

## కిష్టంపేట గ్రామంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.



చెన్నూరు కిష్టంపేట,: చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూరు మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.బిజెపి పార్టీ తరఫున ప్రజలకు అధికారులకు ప్రజా ప్రతినిధులకు విద్యార్థిని విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రియతమ నాయకులు నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా భారతదేశాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ దేశంలోని ప్రజల ఆకాంక్ష మేరకు శాంతి భద్రతలైతేనేమి దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెంది ప్రపంచంలోనే భారతదేశాన్ని ఒక గొప్ప దేశంగా తీర్చి దిద్దడానికి రోజుకి 20 గంటలు పనిచేస్తు తనకంటూ ఎలాంటి సంపాదన లేకుండా దేశంలో ఉన్న పేద ప్రజల అవసరాల కోసం ప్రజలకు సేవ చేయాలని గొప్ప సంకల్పంతో పనిచేస్తున్నారని అన్నాడు.ఇలాంటి నాయకుడు దేశం కోసం ప్రజల కోసం నిరంతర నిస్వార్థ సేవ చేసే వ్యక్తి దొరకడం ప్రజల అదృష్టంగా భావించాలి అని అన్నాడు.

## ప్రైవేట్ సెక్యూరిటీ రెయిన్ కోట్ ల పంపిణి.



గోదావరిఖని, : అన్వేషణ విభాగం గోదావరిఖని ఎక్స్ప్లోరేషన్ క్యాంపు కార్యాలయంలో 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ను ఆవిష్కరించారు. అనంతరం శ్రీ వైష్ణవి సెక్యూరిటీ సంస్థ నందు పనిచేస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ కి డీజీఎం హెచ్ ఓ డి రమేష్ బాబు చేతుల మీదగా వైష్ణవి సెక్యూరిటీ సర్వీసెస్ కాంట్రాక్టర్ దొబ్బెట సతీష్ కుమార్ రెయిన్ కోట్ లను పంపిణీ చేశారు.

## జైపూర్ ఎంపీపీ కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు.



జైపూర్, : జైపూర్ ఎంపీపీ కార్యాలయంలో 80వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు రావు జాతీయ పతాకవిష్కరణ చేయగా అందరు కలిసి జాతీయ గీతం ఆలపించారు. అనంతరం, స్కూల్ పిల్లలకు నోట్ పుస్తకాలు, పిల్లలను పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీపతి బాపూరావు , తహసిల్దార్ వనజ రెడ్డి , ఏఈ హౌసింగ్ కాంక్ష, ఏపీవో బాలయ్య, కార్యాలయ సూపరింటెండెంట్ జి.భాగ్యలక్ష్మి , జైపూర్ సర్పంచ్ కూన భాస్కర్ , ఉప సర్పంచ్ ఇరిగిరాల శ్రావణ్ , మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి బి.ఉదయ్ కుమార్ , మండల నాయకులు చల్ల విశ్వంభర రెడ్డి , చల్ల సత్యనారాయణ రెడ్డి అంబల్ల సంపత్ రెడ్డి అంబల్ల రవి , గ్రామ ప్రజలు తదితరులు హాజరైనారు.

## ముదిగుంట పంచాయతీ కార్యదర్శి కి ప్రశంసా పత్రం



జైపూర్,: జైపూర్ మండలంలోని ముదిగుంట గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న పి.సురేష్ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రము అందుకున్నారు.విధి నిర్వహణలో అంకితభావం సమర్థత, బాధ్యతాయుతమైన కార్య నిర్వహణ,గ్రామపంచాయతీ అభివృద్ధికి నిరంత కృషి చేస్తూ ఉత్తమ పనితీరును కనబరిచినందుకు ఈ ప్రశంసా పత్రము లభించడం పట్ల జైపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపురావు,జైపూర్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పి.సురేష్ ని హృదయపూర్వకంగా అభినందించారు.ఈ సందర్భంగా అవార్డు గ్రహీత పి.సురేష్ కి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ,భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఈ సురేష్ మాట్లాడుతూ..అందరికీ,ముఖ్యంగా ముదిగుంట గ్రామపంచాయతీ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ అవార్డు ద్వారా అందిన ప్రోత్సాహం మరువలేనిదని,విధి నిర్వహణలో ఎల్లప్పుడూ చిత్తశుద్ధితో వ్యవహరిస్తానని,ప్రభుత్వ పథకాలను,అభివృద్ధి పనులను సక్రమంగా నిర్వహించి గ్రామాన్ని అభివృద్ధి పరచడానికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

# మందమర్రిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

మందమర్రి, : దేశభక్తి, జాతీయ స్ఫూర్తి వెల్లివిరిసేలా మందమర్రి పట్టణం, మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్, సింగరేణి సంస్థల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తుంగపిండి రాజలింగు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు దేశానికి చిరస్మరణీయమని, వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. పట్టణ అభివృద్ధికి మున్సిపాలిటీ ప్రాధాన్యత ఇస్తోందని, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, రహదారులు, మురుగు కాలువలు, పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో మందమర్రిని మరింత అభివృద్ధి చేయగలమని పేర్కొన్నారు. మందమర్రి ఎంపీడీవో కార్యాలయంలోనూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళు లర్పించారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సూచించారు. మందమర్రి మార్కెట్ వ్యాపార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా పండుగలో ఎంఆర్ఓ పి. సతీష్ కుమార్ శర్మ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపిస్తూ స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. మార్కెట్ వ్యాపారుల సమిష్టి సహకారంతో వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

### సింగరేణిలో జాతీయ స్ఫూర్తి





సింగరేణి మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, సేవాసమితి అధ్యక్షురాలు ఎన్. శ్రీవాణి రాధాకృష్ణ మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు



పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, సెక్యూరిటీ గార్డ్స్ ప్లటూన్ వందనాన్ని జీఎం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ మహనీయుల ప్రాణత్యాగాల ఫలితంగానే దేశ ప్రజలు స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నారని అన్నారు. సింగరేణి దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేస్తూ జాతీయ ప్రగతికి తోడ్పడుతోందని పేర్కొన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించేందుకు ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేసి సింగరేణిని దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు మందమర్రి పట్టణం, మండలంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జాతీయ



స్ఫూర్తిని చాటాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ సమైక్యత, సామాజిక బాధ్యత, అభివృద్ధి పట్ల ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పలువురు పిలుపునిచ్చారు.

## టీఎన్జీవో భవన్ లో ఘనంగా 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



మంచిర్యాల : 80 వ స్వాతంత్ర దినోత్సవము పురస్కరించుకొని టీఎన్జీవో భవన్ మంచిర్యాలలో జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి జాతీయ పతాకావిష్కరణ చేయడం జరిగినది. టిఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా లోని ప్రజా ప్రతినిధులకు అధికారులకు, ఉద్యోగులకు, నాయకులకు ప్రజలకు 80వ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మంచిర్యాల జిల్లా అన్ని రంగాలు అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ వేడుకలలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్ కుమార్ కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు కోశాధికారి సతీష్ కుమార్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ తిరుపతి రాంకుమార్ సత్యనారాయ నరేందర్ కేజియా రాణి సంయుక్త కార్యదర్శి సునీత పద్మ లత ప్రభు ఆర్గనైజింగ్ సెక్రటరీ మోసిన్ ప్రచార కార్యదర్శి యూసఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రోశయ్య మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్ కార్యదర్శి అజయ్ బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షులు వెంకటేష్ మందమర్రి యూనిట్ అధ్యక్షులు సుమన్ లక్షెట్టిపెట్ యూనిట్ అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

## బలగాల మైనార్టీ గురుకులాల్లో జెండా ఆవిష్కరణ

### 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు



కాగజ్నగర్ మండలం : బలగాల గ్రామంలోని మైనార్టీ రెసిడెన్షియల్ గురుకులం పాఠశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సిర్పూర్ శాసనసభ్యుడు డా. పాల్వాయి హరీష్ బాబు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బలగాల ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద బీటీ రోడ్ మంజూరు చేశారని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. పాఠశాలల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుందని కూడా సూచించారు. శాసనసభ్యుడు విద్యార్థులకు, పరిశ్రమ జీవన్‌కు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు . కార్యక్రమంలో మైనార్టీ గురుకులం ప్రిన్సిపల్ జీవన్ లాల్, గురుకులం ప్రిన్సిపల్ మొయినుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరిగింది

### జెండా ఆవిష్కరణ,పరేడ్,సాంస్కృతిక కార్యక్రమాలు

ఆసిఫాబాద్ : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, నిర్వాచన ప్రాంత సభ్యుడు దండే విఠల్ సందర్భానికి హాజరయ్యారు. జిల్లా అధికారులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. పోలీస్ సిబ్బంది నిర్వహించిన పరేడ్‌ను వీక్షించారు. స్వాతంత్ర్య సమరయోధులకు, దేశ రక్షణ కోసం ప్రాణం బలిచిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. సమాజ సేవలో నిండితిలిచిన అధికారులు, పోలీస్ సిబ్బందికి సేవా పతకాలు ప్రదానం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది అంకితభావంతో కూటమని సూచించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, దేశభక్తి గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకర్షించాయి. విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

## సెల్ ఫోన్లు కాదు,పుస్తకాలకు దగ్గరవ్వండి.

### స్వాతంత్ర్య కోసం ఆసిఫాబాద్ యోధుల పోరాటం గర్వకారణం

### 80వ స్వాతంత్ర్య వేడుకల్లో డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.

### ఫాతిమా కాన్వెంట్ హై స్కూల్ కె ముఖ్య అతిథిగా హాజరు.



కగజ్ నగర్ మండలలో స్వాతంత్ర్య దినోత్సవ పోరాటంలో కొమురం భీమ్ ఆసిఫాబాద్ వాస్తవ్యులు కూడా పాల్గొనడం మనందరికి గర్వకారణం. ఇదే జిల్లాలో పుట్టిన ఆదివాసి వీరుడు కొమురం భీమ్ మరియు కొండా లక్ష్మణ్ బాపూజీ లాంటి మహనీయులు మన దేశ స్వాతంత్ర్య కోసం బ్రిటీష్ వారితో జరిగిన యుద్ధంలో పాల్గొన్నారు. మనం ఈ దేశంలో పుట్టడం మనకు గర్వకారణం.మనకు 80 ఏళ్ల క్రితమే స్వేచ్ఛ స్వాతంత్ర్యం లభించాయి. ఇప్పటికీ చాలా దేశాల్లో చదువుకునే హక్కు లేదు. చాలా దేశాల్లో అమ్మాయిలు పుస్తకాలు పట్టుకుంటే నేరంగా చూస్తున్నారు. చాలా దేశాల్లో గూమికూడి స్వేచ్ఛగా వేడుకలు చేసుకునే పరిస్థితి లేదు. కానీ భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్, అల్లూరి, ఝాన్సీ రాణి, గాంధీ, అంబేద్కర్ వంటి మహనీయులు మనకు స్వాతంత్ర్యాన్ని సాధించి పెట్టారు. స్వేచ్ఛ అంటే విపరీతంగా మొబైల్ వాడడం,గంజాయి సేవించడం,హెల్మెట్ లేకుండా బైక్ నడపడం,పాఠశాలకు ఆలస్యంగా రావడం,చీటింగ్ చేయడం,పరీక్షల్లో కాపీ కొట్టడం కాదు. పుస్తకాలు చదవాలి, మహనీయుల జీవితాల నుండి గొప్ప విషయాలు నేర్చుకోవాలి, ఉపాధ్యాయులను గౌరవించడం, తల్లిదండ్రులను గౌరవించడం అలవర్చుకోవాలి. సిర్పూర్ నియోజకవర్గంలో నా మొట్టమొదటి ఓటు ఈ ఫాతిమా హై స్కూల్ లోనే వేశాను. మొబైల్ ఫోన్ క్రియేటివిటీని నాశనం చేస్తుంది,జీవితాన్ని నాశనం చేస్తుంది. మీరు ఏం కావాలనుకుంటున్నారో గోడ మీద రాసుకోండి,దాని కోసం కష్టపడి పని చేయండి. సొంత శక్తితో ఎదగండి,ఇతరులపై ఆధారపడకండి,ముఖ్యంగా సెల్ ఫోన్ పై ఆధారపడకండి. చిన్న వయస్సులో ఇన్ స్టా, ఫేస్ బుక్,వాట్సాప్ వంటి సోషల్ మీడియా యాప్స్ వాడకండి. ముందు సొంత నివాసం ప్రాణహిత నిలయంగా జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం డాడానగర్,బాలాజీ నగర్, అంబేద్కర్ చౌక్,కోసిని,సర్దార్ బస్తి,కె టౌన్ హోటల్,నౌగం బస్తీల్లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జెండావిష్కరణ చేశారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు,మహిళా నాయకురాలు,అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ ఘనంగా జరిగింది

### పేద, మధ్యతరగతి కుటుంబాలకు సుబిధలు సులభం



ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శాసన మండలి ఉపసభాపతి బండ ప్రకాష్, నిర్వాచన ప్రాంత సభ్యుడు దండే విఠల్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేశారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సులభంగా, పారదర్శకంగా అందానికి పరిస్థితులు సిద్ధం అవుతాయని నాయకులు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరిత, జాయింట్ కలెక్టర్ డేవిడ్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815